

పోలింగ్ తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల్లో జోష్ కనిపిస్తోంది. రికార్డుస్థాయి ఓటింగ్ శాతం తమకే లాభిస్తుందని వీరు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న కసి.. ఓట్లుగా మారాయంటున్నారు. అందుకనే ఎన్నడూలేనంతగా 87.09 శాతం ఓటింగ్ జరిగిందని చెబుతున్నారు. పోలింగ్ సరళి చూస్తుంటే మెజారిటీ స్థానాలూ తమకే వస్తాయని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



● ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే భారీ ఓటింగని నేతల అంచనా

కూటమిలో జోష్

● మెజారిటీ స్థానాలు తమవేనంటూ ధీమా

పోలింగ్ ముగిసింది. ఓటింగ్ సరళిపై ఆయా పార్టీలో నేతలు విపరీతంగా చర్చలు జరుపుతున్నారు. 2019 ఎన్నికల్లో అత్యధికంగా 85.02 శాతం ఓటింగ్ నమోదైంది. అప్పటికి ఇదే భారీ ఓటింగ్ శాతం. ఇది నాటి ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీకి అనుకూలించింది. నాటి ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కుప్పం మినహా 13 చోట్ల వైసీపీ గెలుపొందింది. తిరుపతి, చిత్తూరు పార్లమెంటు స్థానాల్లోనూ విజయం సాధించింది. జిల్లాల పునర్విభజన తర్వాత.. చిత్తూరు జిల్లాలో గత ఎన్నికలకన్నా ఇప్పుడు 2.07 శాతం ఎక్కువ (87.09 శాతం) పోలింగ్ జరిగింది. ఇదీ ప్రతిపక్ష కూటమికే లాభిస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఎన్నికల ముందే కుప్పం, పలమనేరు, నగరి నియోజకవర్గాల్లో విజయంపై టీడీపీ నమ్మకంగా ఉండింది. ఇప్పుడు పోలింగ్ సరళి చూశాక చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరుల్లోనూ గెలుపు సాధిస్తామని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులోనూ సానుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు ఏర్పడినప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ కాంగ్రెస్, వైసీపీ గెలిచాయి. ఈసారి ఆ రెండు చోట్లా టీడీపీ జెండా ఎగరనుందని కూటమి నేతలు అంటున్నారు. ఇంటెలిజెన్స్ సర్వేలోనూ ఇదే విషయం వ్యక్తమైనట్లు కూటమి నేతలు చెబుతున్నారు. చిత్తూరు పార్లమెంటు గెలుపుపై వందశాతం నమ్మకంతో ఉన్నారు.

● ఇక, వైసీపీ నేతలు కూడా కుప్పం తప్ప అన్ని స్థానాల్లోనూ తమ అభ్యర్థులే గెలుస్తారని చెబుతున్నారు. కుప్పంలో భారీగా డబ్బు పంపిణీ చేయడంతో చంద్రబాబుకు మెజార్టీ తగ్గుతుందని అంటున్నారు. మహిళలు, వృద్ధులు, గ్రామీణులు తమకు అనుకూలంగా ఓటేశారని వైసీపీ నాయకులు లెక్కలు వేస్తున్నారు.

ఆయా అభ్యర్థుల సొంత సర్వేలు

పోలింగ్ రోజే ఆయా పార్టీల అభ్యర్థులు సొంతంగా ఎగ్జిట్ పోల్ సర్వే చేయించుకున్నారు. ఓటేసి కేంద్రాల నుంచి బయటికి వచ్చే వారితో మాట్లాడి నాడి తెలుసుకునేందుకు ప్రయత్నించారు. మహిళలు, వృద్ధులు, యువత వంటి వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో గెలుపోటములు ప్రభావితం చేసే సామాజికవర్గాల వారీగా ఎవరు ఏ పార్టీకి మొగ్గు చూపారనేది అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల గణాంకాలు, పోలింగ్ శాతం ముందు పెట్టుకుని రాజకీయ పరిశీలకులతో విశ్లేషణ చేయిస్తున్నారు.

ఓటింగ్ పెరగడానికి కారణాలు

ఐదేళ్లు అన్నిరకాలుగా విసిగిపోయి..

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు 2019 ఎన్నికల్లో కుప్పం మినహా మిగిలిన 13 అసెంబ్లీ, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంటు స్థానాల్లో వైసీపీని గెలిపించారు. కానీ, జిల్లాలో చెప్పకోదగ్గ అభివృద్ధి జరగలేదు. చిత్తూరు జిల్లా విభజన జరిగి రెండేళ్లయినా ఒక్క విద్యా, వైద్య సంస్థలు, పెద్ద పరిశ్రమలు రాలేదు. పేరుకేమో ముగ్గురు మంత్రులున్నా.. ప్రతిపక్షాలపై దాడులు, ఆరోపణలతోనే కాలం వెల్లదీశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల్లో భయాందోళన ఉండడం.. తప్పుల తడకగా భూరీసర్వేలు జరగడం.. పట్టాదారు పాసుపుస్తకాల్లో జగన్ ఫొటోను ముద్రించడం.. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని మోసం చేయడం.. ధరలు పెంచేసి నాసిరకం మద్యాన్ని అందుబాటులో ఉంచడం.. ఇసుక ధరలు బాగా పెంచేసి, అందుబాటులో లేకపోవడం.. 9 సార్లు విద్యుత్తు, 4 సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచడం, పొరుగు రాష్ట్రాల కంటే పెట్రోల్ డీజల్ ధరలు అధికంగా ఉండడం.. బటన్లు నొక్కి పథకాల డబ్బులు విడుదల చేసినా, దానికి పది రెట్లు వివిధ రూపాల్లో లాగేయడం.. తదితరాలపై ఆయా వర్గాల ప్రజల్లో అసహనం ఉంది. ఇవన్నీ పోలింగ్ శాతం పెరగడానికి ఓ కారణమని విశ్లేషిస్తున్నారు.

ఓటు నమోదు, వినియోగంపై అవగాహన

జిల్లా ఎన్నికల యంత్రాంగం ఓటు నమోదు, వినియోగంపై పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది. కలెక్టర్ షన్మోహన్ ఆధ్వర్యంలో ఈఆర్వోలు ఆయా కాలేజీల్లో రెండు మూడు సార్లు ఓటు నమోదు అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. తుది ఓటర్ల జాబితా విడుదలయ్యాక ఆయా మున్సిపాలిటీల్లో, గ్రామీణ ప్రాంతాల్లో స్వీప్ పేరిట ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేశారు. ప్రచార రథాలు, పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా వంటివాటి ద్వారా ప్రచారం చేశారు. వీటివల్లా ఓటింగ్ శాతం పెరిగిందనే అభిప్రాయం ఉంది.

రెండు పార్టీలూ పోటీపడి డబ్బుల పంపిణీ

ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడి మరీ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. కుప్పం మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ దాదాపు సమానంగా పంపిణీ జరిగింది. దీంతో డబ్బు తీసుకున్న ఓటర్లు క్యూలో నిలబడి ఓటేయగా, డబ్బులు ఇచ్చిన నాయకులు వారి ఇళ్లకు వెళ్లి పిలుచుకుని వచ్చి ఓటు వేయించారు. దీంతో పాటు బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి ప్రాంతాల్లో నివసిస్తున్నవారూ తమ గ్రామాలకు వచ్చి ఓటేశారు. ఆయా పార్టీల నాయకులు కూడా బయటి ప్రాంతాల్లో నివశించే వారి కోసం ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేశారు. ఇలా ఓటింగ్ శాతం పెరగడానికి కారణమైన వాటిల్లో అత్యధికం ప్రభుత్వ వ్యతిరేకతే ప్రధానమని కూటమి నేతలు అంటున్నారు. ఈ క్రమంలోనే కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుస్తారనే బెట్టింగులు జోరందుకున్నాయి.

✦ కుప్పం - ఒక విశ్లేషణ

● టీడీపీలో జోరుగా లెక్కలు

● వైసీపీలో కనిపించని ఉత్సాహం

లక్ష లక్ష్యం నెరవేరినట్లేనా!



కుప్పం మున్సిపాలిటీ శీగలపల్లెలోని 156వ నెంబర్ పోలింగ్ బూత్‌లో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలోనూ కొనసాగిన పోలింగ్ (ఫైల్ ఫొటో)

జిల్లాలో అత్యధిక పోలింగ్ జరిగింది కుప్పం నియోజకవర్గంలోనే. 89.88 శాతం ఓటింగ్ నమోదైందిక్కడ. 2019 ఎన్నికల్లో ఇది 85.43 శాతం. అంటే 4.45 శాతం పోలింగ్ పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం.. చంద్రబాబుకు 'లక్ష' మెజారిటీ లక్ష్యాన్ని అందించనుందా అనేది చర్చగా మారింది. ఈ దిశగా టీడీపీలో జోరుగా లెక్కలు వేస్తున్నారు.

- కుప్పం

కుప్పం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు మొదటినుంచి లక్ష మెజారిటీ లక్ష్యం అనే ప్రచారాంశాన్ని తీసుకుంది. సూపర్ సిక్స్ పథకాలతోపాటు అయిదేళ్లలో వైసీపీ చేసిన అరాచకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్య సాధనకు ప్రతి కార్యకర్తా కంకణబద్ధులయ్యారు. దాడులకు, దౌర్జన్యాలకు వెరువకుండా ప్రజల్లోకి వెళ్లారు. చంద్రబాబు మాత్రమే కుప్పం భవిష్యత్తు నిర్ణేత అని, ఇక వేరెవరికి చోటిచ్చినా అధోగతి తప్పదని విస్తృతంగా ప్రచారం చేశారు. అధికార పార్టీ అరాచకాలపై ఉన్న కసి, చంద్రబాబుమీద ఉన్న అభిమానమే పోలింగ్ బూత్‌లకు తండోపతండాలుగా ఓటర్లను రప్పించిందని టీడీపీ శ్రేణులు నమ్ముతున్నాయి. 2019 ఎన్నికల్లో 85.43శాతం పోలింగ్‌కు సుమారు 30 వేల ఓట్లకు చంద్రబాబు మెజారిటీ దిగజారింది. ఇప్పుడు భిన్నమైన పరిస్థితులున్నాయని, వైసీపీమీద కసితో బాబుకు అత్యధిక మెజారిటీ కట్టబెట్టడానికే ఓటర్లు వెల్లువెత్తారన్న విశ్లేషణలు సాగుతున్నాయి. పోలింగ్ రోజు ఉదయంనుంచే టీడీపీ శ్రేణుల్లో ఉరకలు వేస్తున్న ఉత్సాహం.. రోజురోజుకు పెరుగుతోంది.

వైసీపీలో కనిపించని జోరు

పోలింగ్ ప్రారంభమైన ఒకటీ ఒకటిన్నర గంట దాకా వైసీపీ శ్రేణులు కనిపించినా.. ఆ తర్వాత చాలామంది వెళ్లిపోయారు. నిజానికి పంచాయతీలు, మున్సిపాలిటీ అన్నీ అధికార పార్టీ ఏలుబడిలోనే ఉన్నాయి. అయినాసరే, నియోజకవర్గ స్థాయి నేతనుంచీ, గ్రామస్థాయి నేతలదాకా పోలింగ్ బూత్‌ల వద్ద పెద్దగా కనిపించడంలేదు. మంగళవారంనాడు పోలింగ్ పర్యవేక్షణ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ భరత్ కూడా ఈ పరిస్థితిపై వాపోయారట. 'లక్షలకు లక్షలు తీసుకుని, ఇప్పుడు ఒక్కరు కూడా కనిపించడంలేద'ని నిష్ఠూరపోయారని అంటున్నారు. జగన్ 'బటన్ నొక్కుడు' పథకాలు తమను కాపడుతాయన్న నమ్మకం, పోలింగ్ తర్వాత ఆ పార్టీలో పూర్తిగా వమ్మయినట్లు కనిపిస్తోంది. భారీగా పెరిగిన ఓటింగ్ శాతం వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ మిగిల్చింది. పైకి మాత్రం తమ పథకాల లబ్ధిదారులు ఓటువేసేందుకు పోటెత్తడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పుకోవడం తప్ప.. ఆ పార్టీ శ్రేణుల్లో అందుకు తగిన జోష్ మాత్రం కనిపించడంలేదు. పైగా ఓటుకు రూ.4 వేలు ఇచ్చారన్న ప్రచారం బెడిసికొట్టినట్లు కనిపిస్తోంది. ఎంపిక చేసిన 50 శాతం మంది ఓటర్లకే ఈ డబ్బులిచ్చి.. మిగిలిన సగం మందిలో అసంతృప్తి రగలడానికి ఇది కూడా కారణమైందని ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న వైసీపీ నేతలు, లోలోపల మాత్రం గుబులుగానే ఉన్నారు. పేరుకు 13 మంది కుప్పం బరిలో ఉన్నా టీడీపీ, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది.

జిల్లా అంతటా 144 సెక్షన్

చిత్తూరు కలెక్టరేట్, మే 15: పోలింగ్‌కు తర్వాత హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 14వ తేది సాయంత్రం 6 గంటల నుంచి.. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఒకే చోట ముగ్గురు లేదా ఎక్కువ మంది గుమికూడరాదని, డ్రోన్లు ఎగురవేయరాదని, సభలు సమావేశాలు నిర్వహణ నిషేధమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తదనుగుణంగా ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

2,01,903 మంది ఓటేయలేదు

● వీరిలో మహిళా ఓటర్లే ఎక్కువ

చిత్తూరు కలెక్టరేట్, మే 15: జిల్లాలో మహిళా ఓటర్లు ఎక్కువ. కానీ ఎక్కువ మంది ఓటేసింది మాత్రం పురుషులే. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 1563911 మంది ఓటర్లు ఉండగా 1362008 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇది 87.09 శాతం. మొత్తం జిల్లాలో 201903 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. జిల్లా ఓటర్లలో పురుషులు 770154 మంది ఉండగా 674454 మంది ఓటేశారు. 95700 మంది ఓటు వేయలేదు. జిల్లాలో మహిళా ఓటర్లు 793682 మంది ఉండగా వీరిలో 687519 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళల్లో 106163 మంది ఓటు వేయలేదు. కొత్త ఓటర్లు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి సుదీర ప్రాంతాల ఓటర్లు కసిగా వచ్చి ఓటు వేయడంతో 2019ఎన్నికల కంటే పోలింగ్ శాతం పెరిగింది.

స్ట్రాంగ్ రూముల వద్ద పహారా

● కేంద్ర బలగాలతో పటిష్ఠ బందోబస్తు

● చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు

ఎస్వీ సెట్‌లో స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, మే 15: ఈవీఎంలను భద్రపరిచిన ఎస్వీసెట్‌లోని స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బుధవారం ఆయన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలను రెచ్చగొట్టినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్పీ ఆరీఫుల్లా, చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆయన వెంట ఉన్నారు.

అర్ధరాత్రి కుప్పం స్ట్రాంగ్ రూముకు సీల్

చిత్తూరు కలెక్టరేట్: కుప్పం నియోజకవర్గ ఈవీఎంలను మంగళవారం అర్ధరాత్రి స్ట్రాంగ్ రూములో భద్రపరిచి సీలు వేశారు. సోమవారం కుప్పం నియోజకవర్గంలో కొన్నిచోట్ల పోలింగ్ అర్ధరాత్రి వరకు సాగడంతో మంగళవారం మధ్యాహ్నం ఈవీఎం మిషన్లు, ఇతర సామగ్రిని గట్టి పోలీసు బందోబస్తు మధ్య చిత్తూరు ఎస్వీసెట్‌కు రాత్రి 9 గంటలకు తీసుకొచ్చారు. సరిచూసుకుని అర్ధరాత్రి స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు.




మృతిచెందిన వేణు - రాజు



గాయపడిన ట్రాక్టరు డ్రైవరు నాగభూషణం





రాజయ్య - బాబు - జయచంద్ర



మొగిలి ఘాట్‌లో గడ్డి ట్రాక్టరును ఢీకొన్న లారీ

● ఇద్దరు కూలీల దుర్మరణం ● ఐదుగురికి తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, మే 15: ఘాట్ రోడ్డులో లారీ అదుపు తప్పింది. ఎండుగడ్డి ట్రాక్టరును ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం రాత్రి బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాళ్యం మండలం కీరమంద గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు కలిసి పలమనేరు నుంచి ఎండు వరిగడ్డిని బంగారుపాళ్యంకు తీసుకొస్తున్నారు. అదే సమయంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు కట్టెల లోడ్డుతో లారీని తీసుకుని భద్రాచలానికి చెందిన డ్రైవరు రామారావు వస్తున్నారు. మొగిలి ఘాట్ వద్ద రోడ్డు ఏటవాలుగా ఉంది. వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ముందుగా వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనతో ట్రాక్టరు ట్రాలీ ఊడి గడ్డితో పాటు పడిపోయింది. ట్రాక్టరు ఇంజన్ మాత్రం వంద మీటర్ల దూరంలో బోల్తా పడింది. దీని వెనుకే వస్తున్న అట్టపెట్టెల లారీ.. ప్రమాదానికి గురైన కట్టెల లారీని ఢీకొంది. కాగా, ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు ఈ ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో వేణు(60) అక్కడికక్కడే మృతిచెందగా.. రాజా(34), జయచంద్ర (49), రాజయ్య(42), ట్రాక్టరు డ్రైవరు నాగభూషణం(29), బాబు(45), లారీ డ్రైవరు రామారావు(35)ను బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ రాజా మృతి చెందారు. క్షతగాత్రులకు చికిత్స చేయడానికి సరిపడా డాక్టర్, సిబ్బంది బంగారుపాళ్యం ఆస్పత్రిలో లేకపోవడంతో 20 నిమిషాల పాటు క్షతగాత్రులకు వైద్యం అందలేదు. దాంతో స్థానికులు డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ప్రథమ చికిత్స అందించాక మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాద స్థలంలో చీకటిగా ఉండటంతో కట్టెలన్నీ రోడ్డుపై పడటంతో ఎక్స్‌కవేటరు సాయంతో తొలగించారు. రెండు గంటలకుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కింద పడిపోయిన వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన గడ్డి ట్రాలీ



దూరంగా బోల్తాపడిన ట్రాక్టరు

తరచూ ప్రమాదాలు

మొగలిఘాట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పలమనేరు వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ పూర్తిగా డౌన్‌లో రావడంతో డ్రైవర్లు గేర్‌ను డౌన్ చేస్తుంటారు. దాంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు

తాళంబేడు క్రాస్‌లో ప్రమాదం

● ఇద్దరు యువకుల మృతి

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. బీఎస్ఆర్ పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ తెలిపిన ప్రకారం.. జీడీనెల్లూరు మండలం ఆవులకొండకు చెందిన ఘాజీ అబ్బాస్(20), అజ్గర్ అలీ(19) ద్విచక్ర వాహనంపై బీఎస్ఆర్ పేటకు వెళుతున్నారు. తాళంబేడు క్రాస్ వద్ద ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మినీలారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఎక్కడో అమరావతి, ఢిల్లీల్లో కూర్చున్న ఎన్నికల కమిషన్ అధికారులకున్న ముందు చూపు కూడా స్థానికంగా వున్న అధికారులకు లేకపోయిందన్న అపవాదును జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం ఎదుర్కొంటున్నాయి. దాన్ని నిజం చేస్తూ పోలింగ్ రోజు, తర్వాత రోజు ఘటనలను అంచనా వేయడంలోనూ, ముందస్తు చర్యలు తీసుకోవడంలోనూ ప్రత్యేకించి పోలీసు యంత్రాంగం విఫలమైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలో సంభవించిన రాజకీయ హింసాత్మక ఘటనల వెనుక ప్రధానంగా పోలీసు యంత్రాంగం వైఫల్యమే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఈవీఎంల స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేసిన మహిళా వర్శిటీ వద్ద మంగళవారం సాయంత్రం గంటలకొద్దీ కొనసాగిన ఉద్రిక్త వాతావరణం

సున్నిత ప్రాంతాలపై కొరవడిన నిఘా

పోలీసు వైఫల్యంతోనే హింసాత్మక ఘటనలు!

ముందస్తు అంచనాలు, జాగ్రత్తల్లో నిర్లక్ష్యం

ఘర్షణలు జరిగాకైనా మేలుకోని వైనం

144 సెక్షన్ పొడిగించాల్సింది ఎపుడు?

పోలింగ్‌ను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం నుంచీ పోలింగ్ రోజు సాయంత్రం వరకూ సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధిస్తున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ 11వ తేదీ ప్రకటించారు. అయితే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలు పోలింగ్ రోజే జరిగాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా కనీసం చంద్రగిరి నియోజకవర్గంలోనూ, దానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములున్న మహిళా వర్శిటీ ప్రాంతంలోనూ 144 సెక్షన్ అమలును పొడిగించి వుండాల్సింది. అధికారులు ఆ జాగ్రత్త కూడా పాటించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. జరగాల్సిందంతా జరిగాక ఆలస్యంగా మేలుకొని మంగళవారం సాయంత్రం పొడిగిస్తున్నట్టు ప్రకటించారు.

స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు ఏం చేస్తున్నట్టు?

జిల్లాలో పోలీసు శాఖకు అనుబంధంగా స్పెషల్ బ్రాంచి పనిచేస్తుంది. ఈ విభాగం ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఘర్షణాత్మక పరిస్థితులున్నపుడు ప్రధాన పార్టీల నేతల కదలికలను, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ఎస్పీని హెచ్చరించాలి. కానీ అలాంటిదేమీ నాలుగు ఘటనల్లో జరగలేదు. స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్స్ విభాగంతో కూడా జిల్లా ఎస్పీ సమన్వయంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవాల్సి వుంటుంది. ఆ విభాగం పనితీరు కూడా ఈ సందర్భంగా ప్రశ్నార్థకమవుతోంది.

ఈసీకి వున్న ముందుచూపు జిల్లా యంత్రాంగానికేదీ?

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో పరిస్థితులు సజావుగా లేవని ఎన్నికల కమిషన్ ఎప్పుడో గ్రహించింది. దానికి తగ్గట్టుగా అనేక చర్యలు తీసుకుంది. అందులో భాగమే వంద శాతం వెబ్ కాస్టింగ్ అలాగే కేంద్ర బలగాల మొహరింపు. వాస్తవానికి జిల్లా యంత్రాంగం చంద్రగిరిలోని 397 పోలింగ్ కేంద్రాల్లో 202 సమస్యాత్మకమని, 15 తీవ్ర సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. అలాగే తిరుపతిలో 274 పోలింగ్ కేంద్రాలకు గానూ 86 సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. శాంతిభద్రతల పర్యవేక్షణకు వచ్చిన కేంద్ర పరిశీలకుడు ఈ రెండు నియోజకవర్గాలపై వచ్చిన ఫిర్యాదులను, ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని వంద శాతం వెబ్ కాస్టింగ్‌తో పాటు కేంద్ర బలగాల నియామకానికి సిఫారసు చేశారు. ఈసీ సైతం దాన్ని ఆమోదించింది. ఈ నిర్ణయం వెనుకున్న స్ఫూర్తిని జిల్లా యంత్రాంగం యదాతథంగా స్వీకరించలేదన్న ఆరోపణలున్నాయి.

బ్రాహ్మణ కాలవ ఘటనే ఉదాహరణ

రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ టీడీపీకి పట్టున్న గ్రామం. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లు బయటి నుంచీ రావాల్సిందే. ఎక్కడైనా ఒక పార్టీకి గట్టి బలమున్న చోట ప్రత్యర్థి పార్టీల ఏజెంట్లకు రక్షణ వుండదు. అలాంటి చోట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తేనే బలహీనంగా వున్న వర్గంపై బలమైన వర్గం ఆధిపత్యం చెలాయించకుండా వుంటుంది. అక్కడ వైసీపీ ఏజెంట్లపై దౌర్జన్యం జరిగిందని ప్రచారం జరగడంతో వైసీపీ అభ్యర్థి భారీగా అనుచరులను వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్ళడం, దాంతో గ్రామస్తులు ఆగ్రహంతో రెచ్చిపోవడం జరిగాయి. ఈ ఉద్రిక్తతలే గాల్లోకి కాల్పులు జరపడానికి దారి తీశాయి. ఇక్కడ గత ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై దాడి జరిగినంత పనైంది. ఇలాంటి చరిత్ర వున్న పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు తగిన విధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలున్నాయి.

పోలీసు వైఫల్యానికి నిదర్శనం

మహిళా వర్శిటీ ఆవరణలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు జరిపిన దాడి పోలీసు వైఫల్యానికి పరాకాష్ఠగా చెప్పాలి. మహిళా వర్శిటీలో విద్యార్థినులు, వర్శిటీ ఉద్యోగులు తప్ప ఇతరులు ప్రవేశించే అవకాశమే లేదు. అందునా వర్శిటీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వర్శిటీ ఆవరణలోకి ప్రవేశ ద్వారాలు రెండు వుండగా రెండు చోట్లా ప్రాథమిక తనిఖీల తర్వాతే లోనికి అనుమతి లభించాలి. కానీ మంగళవారం రోజు ఇవేమీ కనిపించలేదు. మారణాయుధాలు ధరించిన వైసీపీ వర్గీయులు యథేచ్ఛగా వర్శిటీ ఆవరణలోకి వెళ్ళి నానీపై దాడికి దిగి ఆయనను, గన్‌మ్యాన్‌ను గాయపరిచారు. వాహనాలు ధ్వంసం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లున్న వర్శిటీ ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేయకపోవడమే ఆశ్చర్యంగా వుంది.

నానీపై దాడి పర్యవసానాలను అదుపు చేయలేకపోయిన యంత్రాంగం

నానీపై దాడి జరిగిన అరగంట వ్యవధిలో చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా కనీసం ఐదారు వందలమంది కార్యకర్తలు వర్శిటీ వద్దకు చేరుకుని ప్రతిదాడులకు దిగారు. దాన్ని అంచనా వేసి అదుపు చేయడంలో కూడా పోలీసు యంత్రాంగం దారుణంగా విఫలమైంది. కేంద్ర బలగాలు తిరుపతిలోనే వున్నా కూడా సకాలంలో వర్శిటీ వద్దకు రప్పించలేని దుస్థితిలో అధికారులు వుండిపోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిపై మారణాయుధాలతో స్ట్రాంగ్ రూములున్న వర్శిటీ ఆవరణలో హత్యాయత్నం జరిగినా రెండున్నర గంటల తర్వాత గానీ ఎస్పీ అక్కడికి రాలేదు.

స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థల ఎంపికపై విమర్శలు

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయడమే సరైంది కాదన్న వాదన వినిపిస్తోంది. పద్మావతీ వర్శిటీ విశాలమైంది, అనువైన భవనాలు కలిగివున్నదీ అయినప్పటికీ ఇతర అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. వర్శిటీ ప్రహరీ ఆనుకునే తుమ్మలగుంట గ్రామం వుంది. అది వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి స్వస్థలం. వారికి అక్కడ గట్టి పట్టుంది. పది నిమిషాల వ్యవధిలో వెయ్యిమందిని పోగేసే పరిస్థితి వుంది. అలాగే వర్శిటీకి చేరువగానే టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నివాసం వుంటున్నారు. ఆయనకూ స్థానికంగా ప్రాబల్యం వుంది. ఒక్క పిలుపుతో స్వల్ప వ్యవధిలో వెయ్యిమందిని రప్పించే జనబలముంది. ఉద్రిక్తతలు రాజ్యమేలే ఈ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను పద్మావతీ వర్శిటీలో కాకుండా మరో చోట మరింత భద్రతతో ఏర్పాటు చేసి వుండాల్సిందన్న వాదన వుంది.

నానీ గన్‌మ్యాన్ దుండగులపై కాల్పులు జరిపివుంటే?

పద్మావతీ వర్శిటీ ఆవరణలో మంగళవారం నానీపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేసినపుడు ఆయన గన్‌మ్యాన్ ధరణి నిబంధనలు పాటించారు. తొలుత గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే వెనక్కి తగ్గని వైసీపీ వర్గీయులు నేరుగా గన్‌మ్యాన్‌పైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలా కాకుండా గన్‌మ్యాన్ నేరుగా దాడి చేసిన వారిపై కాల్పులు జరిపివుంటే ఎన్ని మరణాలు సంభవించివుండేవి? తర్వాత పర్యవసానాలు ఎలా వుండేవి? అన్న ప్రశ్నలకు సమాధానాల్లేవు.

రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలతోనూ మేలుకోని వైనం

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు రాత్రి దాడులు, ప్రతిదాడులతో భయానక వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయుల దాడిలో పదిమంది గాయపడగా, ప్రతిదాడిలో వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు వాహనాలు తగులబడ్డాయి. బ్రాహ్మణకాలవతో పాటు ఈ రెండు గ్రామాలకు కూడా వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి స్వయంగా వెళ్ళారు. అధికార పార్టీ అభ్యర్థి మందీ మార్బలంతో వెళ్ళడం వల్లే మూడుచోట్లా ఉద్రిక్తతలు పెరిగాయన్న ఆరోపణలున్నాయి. కనీసం అపుడైనా పోలీసు యంత్రాంగం మేలుకొని పరిస్థితులు అదుపులోకి వచ్చేదాకా వైసీపీ అభ్యర్థిని గృహ నిర్బంధంలో వుంచాల్సింది. అది కూడా చేయలేదు. వైసీపీ దాడులకు టీడీపీ నుంచీ ప్రతిదాడులుంటాయన్న ప్రాథమిక అంచనా కూడా పోలీసు యంత్రాంగానికి లేకపోవడం గమనార్హం. ఇరు పార్టీల అభ్యర్థులకూ షాడో పార్టీలు వేయాలన్న ఆలోచన కూడా చేయలేదు.

చంద్రగిరి ఆర్వో ఏం చేస్తున్నారు?

జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గం సమస్యాత్మకం. ఈ విషయం అటు పోలీసు రికార్డులు, ఇటు ఎన్నికల రికార్డులూ వెల్లడిస్తున్నాయి. ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా తిరుపతి ఆర్డీవో వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, జిల్లా యంత్రాంగానికి ముందస్తు అంచనా నివేదికలు అందజేయడం ఆ అధికారి బాధ్యత. పోలింగ్ రోజు ఘటనలను బట్టి పోలీసు అధికారులతో సమీక్షించడం, ఘర్షణల పర్యవసానాలను అంచనా వేయడం, తదనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవడం కూడా ఆ అధికారి బాధ్యత. అయితే చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో ప్రేక్షకపాత్ర పోషించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా కూడా ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడడం, పోలీసులు లాఠీఛార్జి జరపాల్సి రావడం, ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి జరగడం తెలిసిందే. అప్పట్లో కూడా ఆర్వో సరైన చర్యలు, ముందు జాగ్రత్తలు తీసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలు వచ్చాయి.

పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికీ పలు గ్రామాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన హత్యాయత్నానికి ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదు. ఇరువైపులా అభ్యర్థులకు ప్రమాదం వెన్నంటే వుంది. అనుచర గణం, గన్‌మెన్ లేకుండా ఇరువురూ స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రమాదం వారి కుటుంబ సభ్యులకు కూడా పొంచి వుంది. అలాగే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి, పద్మావతీ వర్శిటీ ఘటనలకు సంబంధించిన కేసుల్లో జరిగే అరెస్టులు కూడా ఆయా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించనున్నాయి. కఠినంగా వ్యవహరించని పక్షంలో ప్రతీకార దాడులు జరిగే అవకాశాలున్నాయి.

నానీపై హత్యాయత్నం చేయించిందెవరు?

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం వెనుక వున్న కీలక వ్యక్తులు ఎవరో ఇప్పటికే వెల్లడైంది. రామచంద్రాపురం మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకులు వల్లేటి భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి ఈ దాడిలో కీలకంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. వారితో పాటు వారి అనుచరులు పాల్గొన్నట్టు వీడియో ఫుటేజీలు కూడా పోలీసులకు లభ్యమయ్యాయి. అయితే వారితో దాడి చేయించింది ఎవరన్నది ప్రశ్నగా మారింది. ఏ కారణాలతో వారు మారణాయుధాలతో దాడికి దిగారు? ఎవరి కోసం అంత రిస్కు తీసుకున్నారు? దాడి వెనుక ముందస్తు ప్రణాళిక వుందా? దాడికి పాల్పడిన వారికి భారీగా లబ్ధి చేకూరే ప్యాకేజీ వంటిదేమైనా వుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి వుంది.

పులిపర్తి నానీకి నేతల పరామర్శ



నానీని పరామర్శిస్తున్న అమర్, దగ్గుమళ్ల

పలమనేరు, మే 15: తిరుపతిలో మంగళవారం వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని బుధవారం పలమనేరు, పూతలపట్టు అభ్యర్థులు అమరనాథరెడ్డి, మురళీ మోహన్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండు చేశారు.

స్విమ్స్ నుంచి డిశ్చార్జి

తిరుపతి(వైద్యం), మే 15 : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం డిశ్చార్జి చేశారు. భుజంపై తగిలిన గాయం ఇంకా పూర్తిగా నయం కాలేదని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించారు. ఇంటివద్ద నానీని వందలాదిమంది టీడీపీ శ్రేణులతో పాటు సీపీఐ నేత నారాయణ, సినీ నటుడు శివాజీ తదితరులు పరామర్శించారు.

నానీపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అదుపులోకి

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, మే 15: పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు బుధవారం ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితులుగా గుర్తించిన రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దాడికి పాల్పడిన వారందరూ లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటి ఇంటి వద్ద సెంట్రింగ్ పనివారుగా గుర్తించినట్లు సమాచారం. తిరుపతి, రామచంద్రాపురం పోలీసులు బుధవారం అనుపల్లిలో 12మందిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తిరుపతికి తరలించారు. వారిలో ఎనిమిది మందిని విడిచిపెట్టి నలుగురిని విచారిస్తున్నట్లు సమాచారం. మహిళావర్శిటీ వద్ద మంగళవారం పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి దాదాపు 10 మందిని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు.

చెవిరెడ్డి రాకతో ఎంఆర్‌పల్లి స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి(నేరవిభాగం), మే 15 : టీడీపీ అభ్యర్థి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు కొంతమంది వైసీపీ కార్యకర్తలను బుధవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసులో ఐదుగురి పేర్లు చూపించి 11 మందిని ఎందుకు తీసుకొచ్చారంటూ ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి బుధవారం రాత్రి స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భారీఎత్తున పోలీసులను మొహరింపజేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. గంట తరువాత చెవిరెడ్డికి ఏఎస్పీ కులశేఖర్ సర్ది చెప్పగా వారక్కడినుంచి వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కుప్పంలో రైతు హత్య

కుప్పం, మే 15: కుప్పంలో రైతు హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కుప్పం మండలం పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన మణి (50) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాలు లేక నీటి కొరత ఏర్పడి వ్యవసాయం భారంగా మారడంతో దానితోపాటు కూలీ పనులకు సైతం వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున తన పొలంలో టమోటాలు తీసుకుని కుప్పం మార్కెట్టుకు బయలుదేరి వచ్చాడు. ఇలా వచ్చిన మణి, కుప్పం అండర్ బ్రిడ్జి సర్కిల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో శవమై తేలాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయన గొంతు కోసి హత్య చేశారు. డీఎస్పీ శ్రీనాథ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి మణి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మణి హత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా మణికి భార్య తులశమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం చేసి అత్తారింటికి పంపారు.



మణి (ఫైల్ ఫొటో)

కిడ్నాప్ కేసులో 23 మంది వైసీపీ శ్రేణులపై కేసు

ప్రాణరక్షణ కల్పించాలని సదుం పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు, మే 15: సదుం మండలం బూరగమంద పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ, బీజేపీ తరపున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోకుండా సోమవారం తెల్లవారుజామున కిడ్నాప్ చేసి గాయపరచిన 23మంది వైసీపీ శ్రేణులపై మంగళవారం ఏఎస్ఐ ఎస్.షామీర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎన్నికల పోలింగ్ రోజున జరిగిన ఈఘటనపై మాజీ సీఎం, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సదుంమండలం గాదివారిపల్లెకు చెందిన పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.సుబ్బరాజు ఫిర్యాదు మేరకు 23మందిపై కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలనుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు వైసీపీ నాయకులు ఎ.రెడ్డెప్పరెడ్డి, పి.వంశీకుమార్‌రెడ్డి, రోహన్ అలియాస్ లాడెన్, ఉదయ్‌కుమార్, చీనేపల్లె మనోజ్, డి.గణేశ్, డి.భగీరథరెడ్డి, పి.గుణశేఖర్, ఎం.మునిరెడ్డి, ఎన్.మునిరాజ, పి.రెడ్డిప్రసాద్, రమేశ్‌రెడ్డి, ఎం.నాగరాజ, జి.రాజేశ్, పి.మల్లికార్జున, ఎం.వినాయక, పి.రాజేంద్ర, ఎం.చిన్నయ్య, ఎం.కిరణ్‌కుమార్, ఎ.దామోదర్‌రెడ్డి, ఎం.శివారెడ్డి, జి.విజయభాస్కర్, జి.కృష్ణయ్యతో పాటు మరో ఎనిమిది మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని సమాచారం.

బీజేపీ ఏజెంట్‌ను బెదిరించిన రౌడీషీటర్‌పై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి ఫోన్‌చేసిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పుంగనూరు, మే 15: పుంగనూరులో బీజేపీ పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న వివేకానందను ఫోన్‌లో బెదిరించిన వైసీపీకి చెందిన రౌడీషీటర్ చెంగలాపురం సూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠకు బుధవారం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రహ్మత్‌నగర్ పోలింగ్ బూత్‌లో వైసీపీకి వ్యతిరేకంగా తోట వివేకానంద ఉంటూ పోలింగ్ అనంతరం ఇంటికి వెళ్లగా చెంగలాపురం సూరి ఫోన్ చేసి దుర్భాషలాడుతూ తీవ్రంగా బెదిరించినట్లు బీజేపీ నేతలు మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కలికిరిలో ఉన్న ఆయన్ను బాధితుడు వివేకానంద, పుంగనూరు బీజేపీ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌బాబు, నాయకులు నరసింహులు, మఠంబాబు, రాజాశెట్టి తదితరులు కలిసి బెదిరింపులపై వివరించారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారా, ఎందుకు బెదిరించారు అని ఆరా తీసి ఎవరూ భయపడకండి తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. మంగళవారం సీఐ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశామని, ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదని చెప్పడంతో ఎస్పీ మణికంఠకు కిరణ్ ఫోను చేశారు. రౌడీషీటర్ బెదిరించిన ఘటనలో ఆధారాలు ఉన్నాయని, వెంటనే తగిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి బీజేపీ కార్యకర్తకు రక్షణ కల్పించాలని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

ఏజెంట్‌ను బెదిరించడం అమానుషం

పుంగనూరులో రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరపున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న వివేకానందను రౌడీషీటర్ సూరి బెదిరించడాన్ని బీజేపీ నాయకులు ఖండించారు. పుంగనూరులో బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మఠంబాబు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు మీడియాతో మాట్లాడారు. వివేకానందకు ఫోన్‌చేసి అంతు చూస్తానని, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇబ్బందులు తప్పవని హెచ్చరించడం దారుణమన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడితే సహించేదిలేదని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. ప్రజల మద్దతుతో గెలవాలి తప్ప హింసకు పాల్పడటం, బెదిరించడం మంచిది కాదని హితవు పలికారు. చెంగలాపురం సూరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏనుగుల దాడిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

సదుం, మే 15: సదుం మండలం జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారపల్లె అటవీ శివారు ప్రాంతంలోని మామిడి తోటల్లో ఏనుగుల దాడిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం తెల్లవారుజామున జంట ఏనుగుల దాడిలో బాబురెడ్డి, చిరంజీవిరెడ్డి పొలాల్లోని విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. ఈశ్వర్ రెడ్డి తోటలోని డ్రిప్ పరికరాలు తొక్కేశాయి. పల్లెచుట్టూ మామిడి తోటలు, సమీపంలోని చెరువులో నీరు అధికంగా ఉండడంతో తరచూ ఏనుగుల సంచారం చేస్తూ ఉండడంతో పొలాల వద్దకు పగలు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ కార్యకర్తకు అమరనాథరెడ్డి పరామర్శ



టీడీపీ కార్యకర్త కేశవులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు/బైరెడ్డిపల్లె మే15 : బైరెడ్డిపల్లె మండలం బాపలనత్తం గ్రామంలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తను మాజీ మంత్రి అమరనాథరెడ్డి బుధవారం పరామర్శించారు. ఎన్నికల సందర్భంగా నెల్లిపట్ల పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. పోలింగ్ ముగిశాక వైసీపీ నాయకులు దారికాచి టీడీపీ నేతలపై కర్రలతో, రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. ఈదాడిలో బాపలనత్తం గ్రామానికి చెందిన కేశవులు గాయపడ్డాడు. ఆయన్ను ప్రాథమిక చికిత్సానంతరం తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. ఈ క్రమంలో కేశవులును అమరనాథరెడ్డి కలిసి పరామర్శించారు. కేశవులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను కోరారు.

పీఈఎస్ వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



టీమ్ సభ్యులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు

కుప్పం, మే 15: కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో వార్షిక వాలీబాల్ ప్రీమియర్ లీగ్-2024వ ఎడిషన్ బుధవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు ప్రారంభించిన ఈ ప్రీమియర్ లీగ్ ఈనెల 24వ తేదీ దాకా జరుగనుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లు పాల్గొంటాయని చెప్పారు. ప్రతి జట్టులో కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఆటగాళ్లుగా ఉంటారన్నారు. క్రీడలు నిర్వహించడంవల్ల కళాశాలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని తెలియజేశారు. డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ఆదిత్యలతో కూడిన ఆర్గనైజింగ్ టీమ్ టోర్నమెంటును పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ కర్యాక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జైలులో టీడీపీ నాయకుడికి అమర్ పరామర్శ



మదనపల్లె సబ్‌జైలు వద్ద ఉన్న మాజీ మంత్రి అమర్

చౌడేపల్లె, మే15: మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి బుధ వారం పరామర్శించారు. రమేష్‌రెడ్డితో పాటు జైలులో ఉన్న మరికొందరి టీడీపీ కార్యకర్తలతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులపై వైసీపీ వారు దాడులు చేసి తిరిగి బాధితులపైనే పోలీసులు కేసుపెట్టి వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ నాయకులు శ్రీని వాసులురెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

విలువలు లేని విద్యతో అనర్థాలు



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

గంగవరం, మే 15: విలువలు లేని విద్యతో మంచికంటే చెడు ఎక్కువ జరిగే ప్రమాదముందని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీ నాథం నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కళామందిరంలో నైతిక విలువలపై విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమం వచ్చి నప్పటి నుంచి విద్యార్థులు తెలుగుపై పట్టు సాధించడానికి కాస్త ఇబ్బంది పడుతున్నారన్నారు. మాతృ భాషపై పట్టు సాధించినప్పుడే మిగిలిన అన్ని సబ్జెక్టులపై సులభంగా పట్టుసాధించ వచ్చొన్నారు. అందుకే వేసవి శిక్షణలో భాగంగా విలువలతో కూడిన విద్యపై శిక్షణనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగ శిక్షణ

పుంగనూరు రూరల్, మే 15: పుంగనూరులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, పతంజలి యోగా ఆధ్వర్యంలో గురువారం నుంచి యోగా మాస్టర్ వనిత ఆధ్వర్యంలో ఉచితంగా యోగ శిక్షణ శిబిరం 15 రోజులు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం స్థానిక కొత్తయిండ్లు షిరిడీసాయి ధ్యాన కళామండపంలో జరిగిన పతంజలి యోగ పరిచయ కార్యక్రమంలో యోగా గురువు వనిత మాట్లాడారు. ఆరోగ్యం కోసం యోగ, సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామములు, ఉత్సాహమే జీవితం తదితర అంశాల గురించి వివరించారు. పురుషులు, మహిళలు, పిల్లలకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9490920710, 9440216173, 9441488681 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రతినిధులు కె.నందీశ్వరయ్య, డాక్టర్ ప్రభాకర్, నానబాల గణేశ్, ఏసీ నారాయణరెడ్డి, వి.జగన్మోహన్‌రెడ్డి, పరంధామనాయుడు పాల్గొన్నారు.

మహాకాలభైరవుడికి రుద్రాభిషేకం



పుంగనూరు రూరల్,మే 15: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్న పూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అష్టమి సంద ర్భంగా మహా కాలభైరవస్వామికి వైభవంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆల య అర్చకులు సుబ్ర హ్మణ్యం స్వామి, రామచంద్రస్వామి శాస్త్రోక్తంగా కాల భైరవస్వామికి భస్మాభిషేకం, రుద్రాభిషేకం, దీపారాధనలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రళయకారుడు, మృత్యుదేవత గర్వాన్ని నశింపజేసే పరమ శివుని అవతారమైన మహా కాలభైరవ స్వామికి అష్టమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇరుపార్టీల నేతలపై కేసు

బంగారుపాళ్యం, మే 15: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగిన సోమవారం రాత్రి నలగాంపల్లెలో టీడీపీ-వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి వైసీపీ, టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. నలగాంపల్లె దళిత వాడకు చెందిన విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకులు ప్రభు నాయుడు, శంకర్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు థామస్ ఫిర్యాదు మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ఎన్‌పీ విక్రమ్, ఎన్‌పీ నవీన్, ఎన్‌పీ లోకేశ్వర్ నాయుడు, లోకేష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మే15: పుంగనూరు శుభారాం ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. క్రీడల్లో, బోధనలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అందుబాటులో ఉందని ఈ అవ కాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాల యంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలియజేశారు.

కుప్పం.. కంపు కంపు!



పోస్టాఫీసు వీధి మలుపులో పేరుకుపోయిన చెత్త



ఎన్జీవో హోమ్ ఎదురు సందులో దుస్థితి

కుప్పం, మే 15: కుప్పం మున్సిపాలిటీ కంపు కొడుతోంది. వీధుల్లో ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకు పోయి దుర్గంధ భరితమైంది కుప్పం. ఏకంగా రెండు నెలల పాటు సార్వత్రిక ఎన్నికల హడావుడి నడిచింది. కుప్పంలో అధికార, ప్రతిపక్షాలు చెరోవైపు మోహరించి యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అధికార పార్టీ తన చేతిలో ఉన్న మున్సిపాలిటీ పారిశుధ్య నిర్వహణ విషయం గురించి పట్టించుకోలేదు. అధికారులు, పాలకులు అందరూ ఎన్నికల పైనే దృష్టిపెట్టారు. క్షణం తీరికలేకుండా అవే కార్యకలా పాల్లో నిమగ్న మయ్యారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపేశారు. మున్సిపల్ కమిషనర్ సైతం ఏఆర్‌వో విధులలో తలమున కలయ్యారు. పారిశుధ్య నిర్వహణ పూర్తిగా కుంటుపడింది. వీధుల్లో పేరుకు పోయిన చెత్తను కనీసం వారానికి ఒకరోజు తొలగించే దిక్కులేకుండా పోయింది. మురుగు కాలువల్లో పూడిక తీత గురించి కనీసం ఆలోచించేవారు లేరు. దీంతో వీధుల పొడవునా చెత్తకుప్పలు పేరుకు పోయాయి. ఆయా వీధుల్లోని వాళ్లే అక్కడ క్కడా పోగుపడిన చెత్తను ఒక వారకు తోసి ఉంచాల్సిన పరిస్థితి. ఇలా తోసిన చెత్తకుప్పలు దోమలకు నిలయంగా మారి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువైంది. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. రాజకీ యాలు చేసే పనిలేదు. అధికారులు సైతం ఎన్నికల విధుల నుంచి రిలాక్స్ అయ్యారు. ఇకనైనా పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించి తమ ఆరోగ్యాలకు రక్షణ కల్పించాలని కుప్పం ప్రజలు కోరుతున్నారు.

పెట్టుబడి పెరుగుతోంది.. ధర తగ్గుతోంది

ఆందోళనలో టమోటా రైతులు ● గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు





సోమలలో టమోటాకు వేసిన మల్చింగ్, సాగులోని టమోటా తోట

సోమల, ఏప్రిల్ 15: రైతులు టమోటా సాగుకోసం పెడుతున్న పెట్టుబడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కానీ రైతులకు గిట్టుబాటు ధర మాత్రం అందడంలేదు. సోమల మండలంలో నవంబరు నెల నుంచి విస్తారంగా వెయ్యి ఎకరాలకు మించి టమోటా సాగు చేశారు. ఎండల తీవ్రతతో టమోటాకు మల్చింగ్ పేపరు వేసి సేద్యం చేస్తున్నారు. ఈ మల్చింగ్ పేపరు గత ఏడాది కంటే రూ. 300, రూ. 400 అధికంగా పెరిగింది. 400 మీటర్ల మల్చింగ్ రోల్ ఈ ఏడాది రూ.2,450 చేరుకుంది. టమోటా నార్లు గత ఏడాది 40, 50 పైసలకు మొలక లభిస్తుండగా, ప్రస్తుతం నర్సరీల్లో సాహో రకం నార్లు మొలక రూపాయి పలుకుతోంది. ఇతర రకాల విత్తన నార్లు వేయడం లేదు. దీంతో రైతుకు పెట్టుబడులు భారీగానే పెరుగుతున్నాయి. దీంతో పాటు ఎరువుల ధరలు మోత రైతు కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 40-50 శాతం మేరకు ధరలు పెరిగాయి. డీఏపీ 50కిలోల బ్యాగు రూ. 1200 నుంచి రూ.1900 చేరుకుంది. ఇంతలా అన్ని ధరలు పెరిగినా టమోటా ధరలు మాత్రం 15కిలోల బాక్స్ రూ.150 నుంచి రూ. 200 లోపే పలుకుతున్నాయి. టమోటా రవాణా, కోత కూలీలు, కమీషన్లు పోను బాక్స్‌కు రూ. 50 మిగులుతోందని రైతులు వాపోతున్నారు. కూలీల దినసరి రేట్లు పెరిగి సేద్యం భారంగా మారింది. మే నెలలో సైతం ఎండ తీవ్రత ఉన్నా మళ్లీ ధరలపై ఆశలతో నాట్లు వేస్తున్నారు. పాలకులు స్పందించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఓర్వలేకనే దళితులపై వైసీపీ నేతల దాడి





సీఐ లక్ష్మయ్యతో చర్చిస్తున్న మురళీమోహన్, ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వస్తున్న దళిత నాయకులు

బంగారుపాళ్యం, మే 15: మండలంలోని దళితులు టీడీపీకి ఓట్లు వేశారనే అక్కసుతోనే వైసీపీకి చెందిన నాయకులు వారిని కులం పేరుతో దూషిస్తూ దాడిచేయడం దారుణమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. బుధవారం ఆయన బంగారుపాళ్యం సీఐ లక్ష్మయ్యతో ఈ విషయమై చర్చించారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. తమ పార్టీ నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను కొట్టేయాలన్నారు. ఈ విషయమై గవర్నర్, డీజీపీ, ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు జయచంద్రనాయుడు, ధరణి, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథరెడ్డి, లోకనాథనాయుడు, దళిత నాయకులు చిన్నయ్య, రవి, శ్రీనివాసులు, గిరిబాబు ఆయన వెంట ఉన్నారు.

నిబద్ధతతో పనిచేసుకుపోతా..

తవణంపల్లె : పార్టీ నాయకులతో కలిసి నిబద్ధతతో పనిచేసుకుని పోతానని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ మోహన్ అన్నారు. మండలంలోని కాణిపాకంక్రాస్ వద్ద గల సీడీఎం కళ్యాణ మండపంలో బుధవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ కుటుంబ సభ్యులు ఈ ఎన్నికల్లో వీరోచితంగా పోరాడారన్నారు. పార్టీ కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మండలాధ్యక్షుడు గాలి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, మండల కార్యదర్శి మధు, నాయకులు మోహన్ నాయుడు, అమరేంద్రనాయుడు, చిట్టెమ్మ, గిరి, మహేష్, పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. అడ్డుకున్న టీడీపీ నేతలు



ఇసుక అక్రమ తరలింపును ఆపాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న చంద్రప్రకాష్, దొరబాబు

చిత్తూరు రూరల్, మే 16: చిత్తూరు రూరల్ మండలం పాలూరు, కమ్మపల్లి వద్ద డంప్ చేసిన ఇసుకను బుధవారం తరలిస్తుండగా టీడీపీ నేతలు చంద్రప్రకాష్, దొరబాబు కార్యకర్తలతో కలిసి అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ జేబు సంస్థ జేపీ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు గడువు ముగిసినా వైసీపీ నేతలు, పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. పరిమితికి మించి ఇసుక తవ్వేయడంతో రీచ్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతాపురం రీచ్‌లో శ్మశానాన్ని సైతం వదలకుండా తవ్వేశారని గుర్తు చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనంతరం బీఎన్ఆర్ పేట పోలీసులు డంప్ వద్దకు చేరుకుని టీడీపీ నేతలతో చర్చించారు. జూన్ 4 తర్వాత ఈ ఇసుకను ప్రజలకు ఉచితంగా అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, జగదీష్‌నాయుడు, కుమార్, గురేష్, శ్యామ్, బాలకృష్ణ, మనోహర్‌నాయుడు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పార్టీల గెలుపోటములపై జోరుగా బెట్టింగులు

పాలసముద్రం, మే 15: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగియడంతో జయాపజయాలపై మండలంలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని గంగమాంబాపురం పంచాయతీలోని ఓ టీడీపీ నేత, వైసీపీ గెలిచి జగనే మళ్లీ సీఎం అవుతారని ఆ పార్టీ నేత బెట్టింగులకు పాల్పడ్డారు. రూ.లక్ష చెక్కులు రాసుకుని మధ్యవర్తికి అందజేశారు. అలాగే ఆముదాలలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ గెలుపొందుతారని టీడీపీ నాయకులు, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపొందుతారని వైసీపీ నాయకులు రూ.10వేలు బెట్టింగ్ కాసి, ఈ డబ్బులను మధ్యవర్తికి అందజేశారు. మండలంలోని టీ దుకాణాలు, రచ్చబండలు, హోటళ్ల వద్ద ఓటింగ్ సరళిపైనే చర్చించుకుంటున్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), మే 15: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఎన్నికల హడావుడి తగ్గడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో తొక్కిసలాట జరగకుండా ఆలయాధికారులు జాగ్రత్త తీసుకున్నారు.

ప్రమాదమని తెలిసీ..!



కల్లూరు హైవేలో మామిడికాయల లోడుపై ప్రయాణిస్తున్న కూలీలు

కల్లూరు, మే 15: మామిడికాయలు సీజన్ వస్తే చాలు పులిచెర్ల మండలం నుంచి దామల్‌చెరువు మామిడికాయల మండీలకు వ్యాపారులు మామిడిని భారీగా తరలిస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టర్లు ద్వారా తరలించే మామిడికాయల లోడుపై కూలీలు కూర్చొని ప్రయాణిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా ట్రాలీలపై ప్రయాణం చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. కల్లూరు ఘాట్‌రోడ్డులో ట్రాక్టర్ల ఇంజిన్ న్యూట్రల్ చేయడం, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడంతోనే పలు ట్రాక్టర్లు బోల్తాపడ్డాయి. పలువురి కూలీల ప్రాణాలు పోయాయి. ఏటా ప్రాణాలు పోతున్నా డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ట్రాక్టర్లలో డ్రైవర్ మినహా ఎవరూ ప్రయాణించరాదనే నిబంధనలకు డ్రైవర్లు తూట్లు పొడుస్తున్నారు. రహదారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డ్రైవర్ల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

సొంతనిధులతో బోయకొండ కార్యాలయ మరమ్మతులు

● ఆలయ ఈవో చంద్రమౌళి

చౌడేపల్లె, మే15: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైన బోయకొండ గంగమ్మ ఆలయ కార్యాలయాన్ని తన సొంత నిధులతో మరమ్మతులు చేయ నున్నట్లు ఆలయ ఈవో చంద్రమౌళి ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లా డుతూ మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో కార్యాలయం సమీపంలో పిడు గులు పడడంతో కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందన్నారు. ఫర్నిచర్, కంప్యూటర్, ఏసీ, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయాయన్నారు. ఈ క్రమంలో కార్యాలయం పునరుద్ధరణతో పాటు మర మ్మతులను సొంత నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు.

21 నుంచి కల్యాణవెంకన్న బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మే 15 : మండలంలోని బేలుపల్లె పంచాయతీ పరిధిలోవున్న పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ధ్వజారోహణం, శేష వాహనసేవ, 22న శ్రీవారి కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న హంసవాహనం, 25న హను మంతవాహనం, 26న పుష్పపల్లకీసేవ, 27న గజవాహనం, 28న ఊంజల్ సేవ, అశ్వవాహనం, దోపోత్సవం, 29వ తేదీ పుష్పయాగం జరుగుతుందని వివరించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

యాళి వాహనంపై మృత్యుంజయేశ్వరుడి విహారం



చౌడేపల్లె, మే15: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 3వ రోజు యాళి వాహనంపై ఆది దంపతులు విహరించారు. బుధవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి యాళివాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి ప్రత్యేకంగా పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాల, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయదారులుగా ఆశోక్‌కుమార్, సుదర్శన కుటుంబీకులు వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, మే15: ద్విచక్రవాహనం ఢీకొని ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన బుధవారం పుంగనూరులో జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుంగనూరు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ కావడంతో వారికి కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక తరగతులకు వచ్చిన విద్యార్థిని గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాలికను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వం ఆస్పత్రిలో చేర్పించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

గురుకుల పాఠశాలకు ముగ్గురి ఎంపిక

సోమల, మే 15: సోమల ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు బైరెడ్డిపల్లె గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎల్లయ్య తెలిపారు. సోమలకు చెందిన భార్గవి, రోశ్విత, తుషార 5వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని వెల్లడించారు.

రేపు సోమల మండల మీట్

సోమల, మే 15: ఈ నెల 17 శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పకహాజరు కావాలని కోరారు.

మామపై అల్లుడి దాడి

పుంగనూరు రూరల్, మే15: మామపై అల్లుడు దాడిచేసి గాయపరిచిన సంఘటన బుధవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె పంచాయతీ షికారి పాళ్యంకు చెందిన రాజ్‌కుమార్‌కు అదే గ్రామానికి చెందిన మేల్‌రాజ్ కుమార్తె సోనితో వివాహమైంది. రాజ్‌కుమార్‌కు సోని కాకుండా మరో ఇద్దరు భార్యలు ఉన్నారు. రాజ్‌కుమార్ గ్రామంలో నివాసం ఉండగా చిన్న భార్య సోని వ్యాపార నిమిత్తం బయట ప్రాంతాలకు వెళుతుండేది. రెండు రోజుల క్రితం సోని గ్రామానికి చేరుకుంది. రాజ్‌కుమార్, భార్య సోని మధ్య గొడవ జరిగింది. సోని తండ్రి మేల్‌రాజ్, అత్త సజని అడ్డు పడ్డారు. ఈ క్రమంలో అల్లుడు రాజ్‌కుమార్ మామ మేల్‌రాజ్‌ను తలపై కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏపీఆర్‌జేసీలో పుత్రమద్ది విద్యార్థుల ప్రతిభ


కీర్తి


రోహిత్

ఐరాల, మే 15: ఏపీఆర్‌జేసీ పరీక్షలలో మండలంలోని పుత్రమద్ది జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన రోహిత్ (ఎంపీసీ) 7,596 ర్యాంకు, కీర్తి (సీఈసీ) 428 ర్యాంకు సాధించినట్లు హెచ్ఎం లక్ష్మణ్‌బాబు తెలిపారు. కీర్తి కర్నూలు జిల్లా బనవాసిలో, రోహిత్ అన్నమయ్య జిల్లా గ్యారంపల్లెలో చదవనున్నట్లు వివరించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ


క్యూలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మే 15: కాణిపాక వరసిద్ధి వినా యకస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఎన్నికల హడావుడి తగ్గడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శ నానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో తొక్కిసలాట జరగకుండా ఆలయాధికారులు జాగ్రత్త తీసుకున్నారు.

రోడ్లపై మురుగు నీరు



చిత్తూరు (సెంట్రల్), మే 15 : నగరంలోని టెలిఫోన్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో నెల రోజులుగా రోడ్డుపై మురుగు నీరు పారుతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. నీరు ప్రవాహంలా పారుతుం డడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, కాలువల గట్లపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నా యని, ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వెంకటమ్మ(ఫైల్)

విజయపురం, మే 15: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆర్.వెంకటమ్మ(111) బుధవారం మృ తి చెందింది. మంగళవారం వరకు కూడా ఆమె పనులు ఆమే చేసుకోవడం విశేషం. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటు సైతం వేసింది. మృతురాలి కుమార్తె వయస్సు 85 సంవత్సరాలు.

రోడ్డును మరమ్మతు చేయండి


ఆలపాక కండ్రిగ - జీఎంపురం రోడ్డు

విజయపురం, మే 15 : మండలంలోని ఆలపాకకం డ్రిగ - జీఎంపురం రోడ్డును మరమ్మతు చేయాలని గ్రా మస్తులు కోరుతున్నారు. రో డ్డు గుంతలమయం కావడం తో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. వర్షాకాలంలో గుంతలు కనిపించక చాలా మంది గాయాలపాలయ్యారని చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక


భానుప్రకాష్

కార్వేటినగరం, మే 15: మండలంలోని గాజంకి దళితవాడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌కు చెందిన కే భానుప్రకాష్ అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం రూప తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి



కార్వేటినగరం, మే 15: పాదిరికుప్పం నుంచి ఆలత్తూరు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు పక్కనే ఉండడమేగాక చేతికందే ఎత్తులో ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మలుపు లో ఉండడంతో రాత్రిపూట పూర్తిగా కనిపించడం లేదని, కొత్తవారు ఎవరైనా వస్తే ప్రమాదం జరిగే అవకాశముందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

కార్వేటినగరం, మే 15: కత్తెరపల్లిలో మహాభారత ఉత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పార్టీల గెలుపోటములపై జోరుగా బెట్టింగులు


పాలసముద్రం, మే 15: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగియ డంతో జయాపజయాలపై మండలంలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని గంగమాం బాపురం పంచాయతీలోని ఓ టీడీపీ నేత, వైసీపీ గెలిచి జగనే మళ్లీ సీఎం అవుతారని ఆ పార్టీ నేత బెట్టింగులకు పాల్పడ్డారు. రూ.లక్ష చెక్కులు రాసుకుని మధ్యవర్తికి అందజేశారు. అలాగే ఆముదాలలో గంగాధరనెల్లూరు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ గెలుపొందుతారని టీడీపీ నాయకులు, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపొందుతారని వైసీపీ నాయకులు రూ.10వేలు బెట్టింగ్ కాసి, ఈ డబ్బులను మధ్యవర్తికి అందజేశారు. మండలంలోని టీ దుకా ణాలు, రచ్చబండలు, హోటళ్ల వద్ద ఓటింగ్ సరళిపైనే చర్చించుకుంటున్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీకి చెక్

- జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, మే 16: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ వ్యాధికి చెక్ పెట్టవచ్చునని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. బుధవారం టీబీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇకపై ప్రతి గురువారమూ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ డేగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ రోజున ఈ వ్యాక్సిన్ తప్పా మరే వ్యాక్సిన్ వేయకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు పైబడిన, షుగర్ వ్యాధిగ్రస్తులు వేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు ఇంట్లో ఉంటే తప్పక వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే చేసి, అర్హులందరికీ ఈ వ్యాక్సిన్ వేయించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు.

పీఈఎస్ వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం


టీమ్ సభ్యులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు

కుప్పం, మే 15: కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో వార్షిక వాలీబాల్ ప్రీమియర్ లీగ్-2024వ ఎడిషన్ బుధవారం ప్రారంభ మైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్. కృష్ణారావు ప్రారంభిం చిన ఈ ప్రీమియర్ లీగ్ ఈనెల 24వ తేదీ దాకా జరుగనుంది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లు పాల్గొంటాయని చెప్పారు. ప్రతి జట్టులో కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఆట గాళ్లుగా ఉంటారన్నారు. క్రీడలు నిర్వహించడంవల్ల కళాశాలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని తెలియజేశారు. డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ఆదిత్యలతో కూడిన ఆర్గనైజింగ్ టీమ్ టోర్నమెంటును పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

దాడి ఘటనలో ఇరుపార్టీల నేతలపై కేసు


పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన దళితులు

బంగారుపాళ్యం, మే 15: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగిన సోమవారం రాత్రి నలగాంపల్లెలో టీడీపీ-వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి వైసీపీ, టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. నలగాంపల్లె దళితవాడకు చెందిన విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకులు ప్రభు నాయుడు, శంకర్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు థామస్ ఫిర్యాదు మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ఎన్‌పీ విక్రమ్, ఎన్‌పీ నవీన్, ఎన్‌పీ లోకేశ్వర్ నాయుడు, లోకేష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నానీపై వైసీపీ శ్రేణుల దాడి హేయం


తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పులివర్తి నానిని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మే 15: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని బుధవారం టీడీ పీ నేతలు పరామర్శించారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానిని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరా వు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత తదితరులు పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్యగా పేర్కొన్నా రు. పోలీసుల వైఫల్యం వల్లే ఈ దాడి జరిగింద న్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

దాడి అమానుషం : భీమనేని

పాలసముద్రం, మే 15: చంద్రగిరి నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ శ్రేణుల దాడిచేయడం అమానుషమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టి బాబు నాయుడు, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి వాసు నాయుడు విమర్శిం చారు. దాడిచేసిన వారిని అరెస్టు చేసి, కఠిన చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీకి ఓటమి భయం పట్టుకున్నందు వల్లనే దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు.

శ్రీరంగరాజపురం : టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై దాడి దారుణమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓడిపోతామనే బాధలోనే వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. జూన్ 4వ తేదీ తర్వాత వారికి తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. పార్టీ నేతలు రాజశేఖర్ నాయుడు, బాలాజీ నాయుడు, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, ఎన్.కుమార్, సిద్దయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి, స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని ఆ పార్టీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ తమ్ముడు నిధి బుధవారం పరామర్శిం చారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

ఓర్వలేకనే దళితులపై వైసీపీ నేతల దాడి


సీఐ లక్ష్మయ్యతో చర్చిస్తున్న మురళీమోహన్


ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వస్తున్న దళిత నాయకులు

బంగారుపాళ్యం, మే 15: మండలంలోని దళితులు టీడీపీకి ఓట్లు వేశారనే అక్కసుతోనే వైసీపీకి చెందిన నాయకులు వారిని కులం పే రుతో దూషిస్తూ దాడిచేయడం దారుణమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. బుధవారం ఆయన బంగారుపాళ్యం సీఐ లక్ష్మయ్యతో ఈ విషయమై చర్చించారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. తమ పార్టీ నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను కొట్టేయాలన్నారు. ఈ విషయమై గవర్నర్, డీజీపీ, ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకు లు జయచంద్ర నాయుడు, ధరణి, కోకా ప్రకాష్ నాయుడు, కమల్ నాథరెడ్డి, లోకనాథ నాయుడు, దళిత నాయకులు చిన్నయ్య, రవి, శ్రీనివాసులు, గిరిబాబు ఆయన వెంట ఉన్నారు.

నిబద్ధతతో పనిచేసుకుపోతా..

తవణంపల్లె : పార్టీ నాయకులతో కలిసి పనిచేస్తానని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. మండలంలోని కాణిపాకంక్రాస్ సీడీఎం కల్యాణ మండపంలో బుధవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నడూ లేని విధంగా టీడీపీ కుటుంబ సభ్యులు ఈ ఎన్నికల్లో వీరోచితంగా పోరాడారన్నారు. కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మండలాధ్యక్షుడు గాలి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ నాయుడు, మండల కార్యదర్శి మధు, నాయకులు మోహన్‌నాయుడు, అమరేంద్రనాయుడు, చిట్టెమ్మ, గిరి, మహేష్, వినాయక, శరవణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ నేతలు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న చంద్రప్రకాష్, దొరబాబు

చిత్తూరు రూరల్, మే 16: చిత్తూరు రూరల్ మండలం పాలూరు, కమ్మపల్లి వద్ద డంప్ చేసిన ఇసుకను బుధవారం తరలిస్తుండగా టీడీపీ నేతలు చంద్రప్రకాష్, దొరబాబు కార్యకర్తలతో కలిసి అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ జేబు సంస్థ జేపీ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు గడువు ముగిసినా వైసీపీ నేతలు, పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. పరిమితికి మించి ఇసుక తవ్వేయడంతో రీచ్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతాపురం రీచ్‌లో శ్మశానాన్ని సైతం వదలకుండా తవ్వేశారని గుర్తు చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనంతరం బీఎన్ఆర్ పేట పోలీసులు డంప్ వద్దకు చేరుకుని టీడీపీ నేతలతో చర్చించారు. జూన్ 4 తర్వాత ఈ ఇసుకను ప్రజలకు ఉచితంగా అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, జగదీష్‌నాయుడు, కుమార్, గురేష్, శ్యామ్, బాలకృష్ణ, మనోహర్‌నాయుడు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ విధుల్లోకి ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, మే 15: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి బిజీగా గడిపిన జిల్లా అధికారులు, ఉద్యోగులు ఆ ప్రక్రియ ముగియడంతో బుధవారం నుంచి తమ కార్యాలయాల్లో విధుల్లో చేరారు. ఓటరు జాబితా, పరిశీలన, ఈవీఎంల ర్యాండమైజేషన్, శిక్షణా తరగతులు, సెట్ కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ రెగ్యులర్ కాన్ఫరెన్స్‌ల పేరిట క్షణం తీరిక లేకుండా గడిపారు. పోలింగ్ రోజు, తర్వాత ఎన్నికల విధుల్లో పాల్గొన్న 13వేల మంది సిబ్బంది నిద్రాహారాలకు దూరమయ్యారు. పోలింగ్ అనంతరం సోమవారం అర్ధరాత్రి వరకు స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు అప్పగించి తమ విధులను పూర్తి చేసుకున్నారు. మంగళవారం ప్రభుత్వం వారికి సెలవిచ్చింది. బుధవారం రెగ్యులర్ డ్యూటీలకు హాజరయ్యారు. ఉద్యోగు లందరూ కార్యాలయాలకు రావడంతో ఆఫీసులు కళకళలాడాయి. మైక్రో అబ్జర్వ ర్లుగా బ్యాంకు, ఎల్ఐసీ, ఇన్సూరెన్స్ ఉద్యోగులను నియమించడంతో సోమ, మంగళవారాల్లో అక్కడ కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. బుధవారం ఉద్యోగులు విధులకు హాజరుకావడంతో బ్యాంకుల్లో రద్దీ ఏర్పడింది

ప్రమాదం గురూ..!


కల్లూరు హైవేలో మామిడికాయల లోడుపై ప్రయాణిస్తున్న కూలీలు

కల్లూరు, మే 15: మామిడికాయలు సీజన్ వస్తే చాలు పులిచెర్ల మండలం నుంచి దామల్‌చెరువు మామిడికాయల మండీలకు వ్యాపారులు మామిడిని భారీగా తరలిస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టర్ల ద్వారా తరలించే మామిడికాయల లోడుపై కూలీలు కూర్చొని ప్రయాణిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా ట్రాలీలపై ప్రయాణం చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. కల్లూరు ఘాట్‌రోడ్డులో ట్రాక్టర్ల ఇంజిన్ న్యూట్రల్ చేయడం, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడంతోనే పలు ట్రాక్టర్లు బోల్తాపడ్డాయి. పలువురి కూలీల ప్రాణాలు పోయాయి. ఏటా ప్రాణాలు పోతున్నా డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ట్రాక్టర్లలో డ్రైవర్ మినహా ఎవరూ ప్రయాణించరాదనే నిబంధనలకు డ్రైవర్లు తూట్లు పొడుస్తున్నారు. రహదారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డ్రైవర్ల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

పెట్టుబడి పెరుగుతోంది.. ధర తగ్గుతోంది

ఆందోళనలో టమోటా రైతులు ● గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు


సాగులోని టమోటా తోట

సోమల, ఏప్రిల్ 15: రైతులు టమోటా సాగుకోసం పెడుతున్న పెట్టుబడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కానీ రైతులకు గిట్టుబాటు ధర మాత్రం అందడంలేదు. సోమల మండలంలో నవంబరు నెల నుంచి విస్తారంగా వెయ్యి ఎకరాలకు మించి టమోటా సాగు చేశారు. ఎండల తీవ్రతతో టమోటాకు మల్చింగ్ పేపరు వేసి సేద్యం చేస్తున్నారు. ఈ మల్చింగ్ పేపరు గత ఏడాది కంటే రూ. 300, రూ. 400 అధికంగా పెరిగింది. 400 మీటర్ల మల్చింగ్ రోల్ ఈ ఏడాది రూ.2,450 చేరుకుంది. టమోటా నార్లు గత ఏడాది 40, 50 పైసలకు మొలక లభిస్తుండగా, ప్రస్తుతం నర్సరీల్లో సాహో రకం నార్లు మొలక రూపాయి పలుకుతోంది. ఇతర రకాల విత్తన నార్లు వేయడం లేదు. దీంతో రైతుకు పెట్టుబడులు భారీగానే పెరుగుతున్నాయి. దీంతో పాటు ఎరువుల ధరలు మోత రైతు కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 40-50 శాతం మేరకు ధరలు పెరిగాయి. డీఏపీ 50కిలోల బ్యాగు రూ. 1200 నుంచి రూ.1900 చేరుకుంది. ఇంతలా అన్ని ధరలు పెరిగినా టమోటా ధరలు మాత్రం 15కిలోల బాక్స్ రూ.150 నుంచి రూ. 200 లోపే పలుకుతున్నాయి. టమోటా రవాణా, కోత కూలీలు, కమీషన్లు పోను బాక్స్‌కు రూ.50 మిగులుతోందని రైతులు వాపోతున్నారు. కూలీల దినసరి రేట్లు పెరిగి సేద్యం భారంగా మారింది. మే నెలలో సైతం ఎండ తీవ్రత ఉన్నా మళ్లీ ధరలపై ఆశలతో నాట్లు వేస్తు న్నారు. పాలకులు స్పందించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాద ముందని తెలిపారు.

యాళి వాహనంపై మృత్యుంజయేశ్వరుడి విహారం

చౌడేపల్లె, మే15: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుం జయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 3వ రోజు యాళి వాహనంపై ఆది దంపతులు విహరిం చారు. బుధవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధా నార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతా భిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి యాళివాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేకంగా పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాల, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, మే15: ద్విచక్రవాహనం ఢీకొని ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన బుధవారం పుంగనూరులో జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుంగ నూరు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో వారికి కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక తరగతులకు వచ్చిన విద్యార్థినిని గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడింది. స్థానికులు బాలికను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వం ఆస్పత్రిలో చేర్పించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

అంతుచిక్కని ఓటరు నాడి

- గెలుపుపై టీడీపీ ధీమా
- ఆశల పల్లకిలో వైసీపీ
- సైలెంట్ ఓటింగ్‌పై మల్లగుల్లాలు

పుత్తూరు అర్బన్, మే 15: ఎన్నికల సంగ్రామం పూర్తయ్యింది. ఓటరు తీర్పు ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తం అయింది. నగరి నియోజకవర్గంలో ఓటరు నాడి ప్రధాన పార్టీలకు అంతు చిక్కడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గెలుపుపై టీడీపీ ధీమా వ్యక్తం చేస్తుండగా, వైసీపీ ఆశల పల్లకిలో ఊరేగుతోంది. సోమవారం రాత్రి వరకు జరిగిన పోలింగ్ తమకే అనుకూలమని ఇరు పార్టీలు విశ్లే షించుకుంటున్నాయి. పోలింగ్ సరళిని అంచనా వేస్తూ విజయావకాశాలను అంచనా వేసుకుంటు న్నారు. ఇదిలా ఉండగా ప్రధానంగా మహిళా ఓటర్లు ఈ దఫా సైలెంట్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. గతంలో ఏ పార్టీకి ఓటేసింది పోలింగ్ తరువాత చెప్పుకునే మహిళలు ఈసారి మాత్రం గుంభనంగా ఉండడం, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల మహిళా ఓటర్లు ఎటు వైపు మొగ్గుచూపారనే విషయంపై ప్రధాన పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచుతుందోననే మీమాంస నాయకుల్లో కొట్టిచ్చినట్లు కనబడుతోంది.

గెలుపుపై టీడీపీ ధీమా

గత రెండు ఎన్నికలతో పోలిస్తే ఈసారి తమకు గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని టీడీపీ అంచనా వేస్తోంది. గత ఎన్నికల్లో 87.09 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి కూడా ఇంచు మించు అదేస్థాయిలో 87.08 శాతం నమోదైంది. అయితే ఓటరు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందనే ధీమా టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తు న్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత తోడు సిట్టింగ్ ఎమ్మెల్యే రోజా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, రెండు దఫాలు ఆమెకు అవకాశం కల్పించిన నియోజక వర్గ ఓటర్లు ఈ దఫా మార్పు కోరుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వైసీపీలో కీలక నాయకులు ఎన్నికలకు ముందు టీడీపీ కండువా కప్పుకోవడం కూడా తమకు కలిసి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రచారం మొదలుకుని పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో టీడీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో ఆధిపత్యం కనబరిచాయి. దీనితో పాటు నియోజక వర్గంలో బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పవర్‌లూమ్స్ వర్గాలకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఆ వర్గాల్లో వార్ వన్ సైడ్ అయ్యేందుకు దోహదం చేసిందని అంతర్గత చర్చల్లో వినిపి స్తోంది.

ఆశల పల్లకిలో వైసీపీ

సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ఎస్సీ, ఎస్టీ ఓట ర్లుతో పాటు ఓటుకు రూ.రెండు వేలు తమను విజ యతీరాలకు చేర్చుతుందని వైసీపీ శ్రేణులు ఆశల పల్లకిలో ఊరేగుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత మహిళలు తమకు అనుకూలంగా ఓటేశా రని చర్చించుకుంటున్నారు. అయితే గత ఎన్నికల్లో డ్వాక్రా రుణమాఫీ హామీ మహిళా ఓటు బ్యాంక్ వైసీపీకి టర్న్ కావడంలో కీలక పాత్ర పోషించింది. గత ఎన్నికల్లో పురుషుల కన్నా 2814 ఓట్లు మహి ళలు అధికంగా ఓటు వేశారు. దీంతో వైసీపీ అభ్య ర్థిగా పోటీ చేసిన రోజా 2,708 స్వల్ప ఓట్ల మెజా ర్టీతో గట్టెక్కింది. అయితే ఈ దఫా వైసీపీ మేని ఫెస్టో చప్పగా ఉండడంతో డ్వాక్రా సంఘాల మహి ళలను నిరుత్సాహపరిచినట్లు సమాచారం. పైగా విపరీతంగా పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావస రాల ధరలపై పేద, మధ్య తరగతి వర్గాలు వైసీపీ ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నట్లు నియోజకవ ర్గంలో చేపట్టిన పలు సర్వేలు తేటతెల్లం చేశాయి. రెండు దఫాలు ఎమ్మెల్యేగా గెలవడానికి దోహదం చేసిన వడమాలపేట మండలంలో ఈసారి టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది.

క్రాస్ ఓటింగ్ భయం

ఇదిలా ఉండగా ప్రధాన పార్టీలను క్రాస్ ఓటింగ్ భయం కుంగదీస్తోంది. అసలే అత్తెసరు మెజార్టీతో గెలిచే సీటు కావడంతో క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచుతుందనే ఆందోళన ఇరుపార్టీల్లోను వ్యక్తమ వుతోంది. రెండు పార్టీల నుంచి తాయిలాలు అందు కున్న ఓటర్లు ఒక ఓటు అటు, మరొక ఓటు ఇటు వేసి ఉంటే ఆ ప్రభావం ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తుందనే చర్చ సాగుతోంది. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ గెలుపును నిర్దే శించనుందనే అభిప్రాయాలను రాజకీయ పరిశీల కులు వ్యక్తం చేస్తున్నారు. అంచాలు ఎలా ఉన్నా తుది ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు ఆగక తప్పదు.

మామపై అల్లుడి దాడి

పుంగనూరు రూరల్, మే15: మామపై అల్లుడు దాడిచేసి గాయపరిచిన సంఘటన బుధవారం పుంగనూ రు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె పంచాయతీ షికారి పాళ్యంకు చెందిన రాజ్‌కుమార్‌కు అదే గ్రామానికి చెం దిన మేల్‌రాజ్ కుమార్తె సోనితో వివాహమైంది. రాజ్‌కు మార్‌కు సోని కాకుండా మరో ఇద్దరు భార్యలు ఉన్నారు. రాజ్‌కుమార్ గ్రామంలో నివాసం ఉండగా చిన్న భార్య సోని వ్యాపార నిమిత్తం బయట ప్రాంతాలకు వెళుతుం డేది. రెండు రోజుల క్రితం సోని గ్రామానికి చేరుకుంది. రాజ్‌కుమార్, భార్య సోని మధ్య గొడవ జరిగింది. సోని తండ్రి మేల్‌రాజ్, అత్త సజని అడ్డు పడ్డారు. ఈ క్రమంలో అల్లుడు రాజ్‌కుమార్ మామ మేల్‌రాజ్‌ను తలపై కొట్ట డంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం పుంగ నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహాకాలభైరవుడికి రుద్రాభిషేకం

పుంగనూరు రూరల్,మే 15: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్న పూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అష్టమి సందర్భంగా మహా కాలభైరవస్వామికి వైభవంగా రుద్రాభిషేకం నిర్వహిం చారు. ఆలయ అర్చకులు సుబ్ర హ్మణ్యం స్వామి, రామచంద్రస్వామి శాస్త్రోక్తంగా కాల భైరవస్వామికి భస్మాభిషేకం, రుద్రాభిషేకం, దీపారాధనలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రళయకారుడు, మృత్యుదేవత గర్వాన్ని నశింపజేసే పరమ శివుని అవతారమైన మహా కాలభైరవ స్వామికి అష్టమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిం చినట్లు తెలిపారు.